క్లుప్తంగా

భూ సర్వేపై రైతులకు అవగాహన



సర్వేపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రంగలక్ష్మి

సింహాచలం: సమగ్ర భూ సర్వేతో భూ వివాదాలకు చెక్ పడుతుందని డిప్యూటీ తహసీల్దార్ రంగలక్ష్మి అన్నారు. పెందుర్తి మండలం గుర్రంపాలెంలో రైతులకు సమగ్ర భూసర్వేపై గురువారం అవగాహన కల్పించారు. గ్రామంలో జరిగే సమగ్ర భూసర్వేకు రైతులంతా సహకరించాలని ఆమె కోరారు. సర్వే ఏవిధంగా చేస్తారో వివరించారు. ప్రతీ రైతు తమ భూమికి సంబంధించిన పాస్‌పుస్తకాలు, ఇతర డాక్యుమెంట్లు, ఫొటోలతో సర్వే చేస్తున్నప్పుడు ఆయా భూముల వద్ద ఉండాలని సూచించారు. సర్వే పారదర్శకంగా జరిగేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నక్క కనక రాజు, సర్పంచ్ ఉగ్గిన గోవింద, ఆర్ఐ శివ, కార్యదర్శి నాగరాజు ప్రభు, సర్వేయర్ లక్ష్మి, సర్వే సిబ్బంది, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎస్.సతీష్, వార్డు మెంబర్ దేముడు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఖోఖో పోటీలు



ఖోఖో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సబ్బవరం: సబ్బవరం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు గురువారం బుక్ రీడింగ్, న్యూస్ పేపర్ రీడింగ్ నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి శిరీష తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో ప్రతిరోజూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఖోఖో ఇతర క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన వారికి శిక్షణ శిబిరం ముగింపు రోజున బహుమతులు అందజేయనున్నట్టు ఆమె తెలిపారు.

శ్లోకాల పఠనంపై అవగాహన



సంస్కృత శ్లోకాల పఠనంపై శిక్షణ ఇస్తున్న గోపాలకృష్ణమాచార్యులు

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు సంస్కృత శ్లోకాల పఠనంపై శిక్షణ ఇచ్చారు. సింహాచలం దేవస్థానం విశ్రాంత ప్రధానార్చకుడు గొడవర్తి గోపాల కృష్ణమాచార్యులు సంస్కృత శ్లోకాల పఠనంలో మెలకువలను వివరించారు. సంస్కృత శ్లోకాల అధ్యయనంతో భాష, భావం సులభతరమవుతాయని వివరించారు. గ్రంథాలయ రీడర్స్ ఫోరం అధ్యక్షుడు బి.బి.రాజేంద్రప్రసాద్, కార్మిక నేత జి.సూర్యనారాయణరాజు ధ్యానంపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి నరసింహం పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

సింహాచలం: మేహాద్రిగెడ్డ కాలువలో యువకుడి మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. 94వవార్డు పరిధి వెంకటసాయినగర్‌లో ఉంటున్న కె.తిరుపతి, అప్పలనర్సమ్మల రెండో కుమారుడు ఈశ్వరరావుకి మతిస్థిమితం సరిగ్గా ఉండదు. అప్పుడప్పుడు మేహాద్రిగెడ్డకు స్నానానికి వెళ్తుంటాడు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటికి వెళ్లి రాలేదు. గురువారం ఉదయం మేహాద్రిగెడ్డ కాలువలో మృతిచెంది ఉన్నాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పెందుర్తి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

పాలిటెక్నిక్ ప్రవేశాల కమిటీలో గైస్ ప్రిన్సిపాల్

మురళీనగర్ (విశాఖ ఉత్తర): 2023 పాలిసెట్ అడ్మిషన్ కమిటీలో విశాఖపట్నం గవర్నమెంట్ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వెంకటరమణకు అవకాశం కల్పించారు. పాలిటెక్నిక్‌లో చేరే అభ్యర్థుల ఎంపికలో ఈయన బోర్డు మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు.

బాబోయ్ భౌ



పరవాడ రహదారిపై గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

- గ్రామాల్లో వీధి కుక్కల స్వైర విహారం
- పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- చర్యలు చేపట్టాలని ప్రజల డిమాండ్

పరవాడ: గ్రామ సింహాలు పల్లెల్లో స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయపెడుతున్నాయి. పాద చారులతో పాటు వాహనాలపై వెళుతున్న వారిపై దాడి చేస్తున్నాయి. దీంతో రోడ్ల మీద తిరగడానికి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా వీధి కుక్కల గుంపులే దర్శనమిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ సింహాల నిర్మూలనకు పంచాయతీ పాలక వర్గాలు కనీస చర్యలు చేపట్టక పోవడం పై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భయం.. భయం

పరవాడ, వాడచీపురుపల్లి, తానాం, దేశపాత్రుని పాలెం, ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, రావాడ, భర్నికం, గొర్లివానిపాలెం, వెన్నలపాలెం, కలపాక, తిక్కవానిపాలెం తదితర గ్రామాల్లో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. దీంతో ఆ గ్రామాల ప్రజలు భయం గుప్పిట్లో కాలం వెళ్లదీస్తున్నారు. రోడ్లపై కుక్కలు మకాం వేస్తున్నాయి. దీంతో కాయగూరలు, చికెన్, మటన్, చేపలు, నిత్యావసర వస్తువులకు కొనుగోలు చేయడానికి వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. చీకటి పడితే వీధుల్లో తిష్ట వేసి అరుపులు కేకలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. అర్ధరాత్రి సమయంలో అరుపులతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కుక్కల బారిన పడి పరవాడ, వాడచీపురుపల్లి పీహెచ్‌సీలకు రోజుకు నాలుగైదు కేసులు వస్తున్నాయని ప్రభుత్వ వైద్యాధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో గుంపులుగా సంచరిస్తున్న గ్రామ సింహాలను నిర్మూలించాలని అధికారులను కోరినా ప్రయోజనం కనిపించలేదని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి అరికట్టడానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



వాడచీపురుపల్లిలో సంచరిస్తున్న గ్రామ సింహాలు

రెజ్లర్లను వేధించిన ఎంపీపై చర్యలకు డిమాండ్



మండల పరిషత్ కూడలిలో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

పరవాడ: క్రీడాకారులను లైంగికంగా వేధించిన రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్‌సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మండల పరిషత్ కూడలిలో ప్రజా సంఘాల నాయకులు గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఢిల్లీలో 25 రోజులుగా మహిళ రెజ్లర్లు తమపై జరిగిన లైంగిక వేధింపులకు నిరసనగా జంతర్ మంతర్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్నారని.. అయినా స్పందించక పోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం తిరిగి క్రీడాకారులపైనే దాడులు చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. పోక్సో, నిర్భయ చట్టాలను అమలు చేసి బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేసి మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో క్రీడాకారులకు అండగా జరిగే ఆందోళనలకు ప్రతి ఒక్కరు కలిసి రావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకర్రావు, జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.రమణమూర్తి పిలుపునిచ్చారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన సేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవంగా గ్రామదేవతల అనుపు



పెద్దలతో కలిసి బంగారమ్మతల్లిని దర్శించుకుంటున్న సీఐ రంగనాథం

సబ్బవరం: మండలంలోని గొర్లివానిపాలెం శివారు జోడుగుళ్లలో కొలువైన బంగారమ్మ, కుంచాలమ్మ అమ్మవార్ల అనుపు మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ పెద్దలతో కలిసి అమ్మవారిని దర్శించుకున్న సీఐ రంగనాథం వనిత ఉషోదయ యువజన సంఘం ఏర్పాటు చేసిన ఉచిత ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నవదుర్గా అమ్మవారి వేషధారణలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సబ్బవరం: మండలంలోని 33/11 కేవీ సబ్బవరం, అంతకాపల్లి సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ సబ్బవరం డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నిరీక్షన్ అంబేడ్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. సబ్బవరం, అంతకాపల్లి సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విజేతలకు వీసీ అభినందన



విజేతలకు సర్టిఫికెట్లు బహూకరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉన్నత్ భారత్ అభియాన్ రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో అభినందించారు. ఉన్నత భారత్ అభియాన్ లక్ష్యాలకు అనుగుణంగా కళాశాలల వారీగా ఈ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, యూబీఏ నోడల్ అధికారి ఆచార్య జి.నాగరాజు, ప్రాంతీయ సమన్వయకర్త బి.పావని, డాక్టర్ సోనీ హవీల, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన బొద్దు హోమరావు

పరవాడ: స్థానిక జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నివాసం ఉంటున్న బొద్దు హోమరావు ఈ నెల 16 నుంచి కనిపించడం లేదని అతని భార్య రామలక్ష్మి పరవాడ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ నెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన భర్త సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కాలనీ వాసులు, పరిసర గ్రామాల్లో వెతికారు. అయినా ప్రయోజనం లేక పోవడంతో రామలక్ష్మి పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు.

మరో యువకుడు



రుషేంద్ర

పరవాడ: పెదముషిడివాడ గ్రామానికి చెందిన పి.రుషేంద్ర అనే యువకుడు ఈ నెల 16 నుంచి కనిపించడం లేదని అతని తండ్రి పళ్ల అప్పారావు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ పి.ఈశ్వరరావు అందించిన వివరాలు.. అప్పారావు కుమారుడు రుషేంద్ర ఏడాది కిందట ప్రేమ వివాహం చేసుకొన్నాడు. కాగా రుషేంద్ర పై అతని భార్య కంచరపాలెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో మనస్థాపం చెందిన రుషేంద్ర ఈ నెల 16న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేసి ఉంది. కుటుంబ సభ్యులు పరిసర గ్రామాల్లో వాకబు చేసినా ప్రయోజనం లేదని అప్పారావు పోలీసులకు అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఈశ్వరరావు చెప్పారు.

ఐక్య పోరాటాలతోనే ఉక్కు పరిరక్షణ



దీక్షలో పాల్గొన్న ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వ రంగ సంస్థల వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధిస్తుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఇందు కోసం రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఏకమై ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేట్‌పరం కాకుండా కాపాడుకోవాలని కోరారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు గురువారానికి 826వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సీఎంఎం, సీఆర్ఎంపీ, సీఈడీ, లూబ్రికేషన్ అండ్ ఫ్యాబ్రికేషన్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించి, కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెడుతోందని, ఇది దుర్మార్గమైన చర్య అని అన్నారు. బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘీభావం తెలిపాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నిరంకుశత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడంతో పాటు అర్హులైనవారందరికీ సంక్షేమ పథకాలు అందించే ధ్యేయంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. జీవీఎంసీ 97వ వార్డు 494 సచివాలయం పరిధిలోని బృందావన్ కాలనీ, ఏకలవ్య కాలనీలో గురువారం ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే తమ దృష్టికి తేవాలన్నారు. సాంకేతిక సమస్య వల్ల పథకాలు అందక పోతే తీసుకోవాల్సిన చర్యలను సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో 97వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్ పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరీ



కచేరి ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, శృతి, స్టీల్‌క్లబ్ ప్రతినిధులు

ఉక్కునగరం: స్థానిక స్టీల్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన గాత్ర కచేరీ ఆహూతులను అలరించింది. శృతి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన ఈ కచేరీలో ప్రముఖ విద్వాంసులు, విజయనగరం సంగీత కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఎ.నారాయణ గాత్ర మాధుర్యంతో శ్రోతలను ఆనంద డోలికల్లో ముంచెత్తారు. వయొలినిస్టు నీలాద్రిరావు, మృదంగం వాద్యకారుడు ఏడుకొండలు సహకారం అందించారు. అనంతరం వారిని శృతి, స్టీల్‌క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. అంతకు ముందు స్టీల్‌ప్లాంట్ జీఎం (మెకానికల్) పి.ఎస్. ఘోష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా దాసరి ప్రతిభా అవార్డు గ్రహీత, సినీ దర్శకుడు డి.దివాకర్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో శృతి కార్యదర్శి ఎస్. రమణారావు, స్టీల్‌క్లబ్ కార్యదర్శి నారాయణ దొర, కె. శ్రీనివాస్, కె. సత్యనారాయణ, కె.ఎల్. నరసింహం తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడు ఆత్మహత్య



దారయ్య (ఫైల్)

ఆనందపురం : మండలంలోని కోలవానిపాలెం గ్రామానికి చెందిన ఓ యువకుడు ఇటీవల అదృశ్యం కాగా గురువారం గోరింట శివారులోని ఓ లేఅవుట్‌లో శవమై కనిపించాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... కోలవానిపాలెం గ్రామానికి చెందిన గంట్రెడ్డి దేముడు, మహాలక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం కాగా దారయ్య (26) ఆఖరివాడు. పదో తరగతి వరకూ చదువుకున్న దారయ్య పెందుర్తి మండలం గొరపల్లిలో ఓ యజమాని వద్ద జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి వివాహం కాలేదు. ఈ నెల 13న ఎప్పటిలాగే ద్విచక్ర వాహనంపై గొరపల్లి వెళ్లి విధుల్లో జాయిన్ అయ్యాడు. సాయంత్రం ఇంటికి ఫోన్ చేసి విధులు ముగించుకొని వస్తున్నానని సమాచారం ఇచ్చాడు. అనంతరం రాత్రి 8 : 30 గంటల ప్రాంతంలో మరలా ఇంటికి ఫోన్ చేసి పని ఉందని, ఇంటికి రావడం లేదని చెప్పాడు. అలా తెలిపిన దారయ్య మరుసటి రోజు ఉదయానికి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు అతను పనిచేస్తున్న యజమానిని వాకబు చేశారు. 13న సాయంత్రమే పనిలో నుంచి వెళ్లిపోయినట్టు తెలపడంతో దారయ్య ఫోన్‌కు కాల్ చేయగా స్విచ్ ఆఫ్ చేసి చేసి ఉంది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో మండలంలోని గోరింట గ్రామంలోని కొండవాలు ప్రాంతంలో వేసిన లేఅవుట్‌లో యువకుడి శవం పడి ఉండడాన్ని కొంత మంది గమనించి పోలీసులకు, గ్రామస్తులకు సమాచారం అందించారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అది దారయ్య మృతదేహంగా కుటుంబ సభ్యులు గుర్తించారు. సీఐ రామచంద్రరావు, ఏఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. ఘటనా స్థలంలో ఉన్న పురుగుల మందు డబ్బా, మద్యం సీసా, వాటర్ బాటిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో ఆన్ చేసి వివరాల సేకరణకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు పాల్పడడానికి ముందు రోజున దారయ్య తన స్నేహితుడిని కలిసి తనకు తీవ్ర అనారోగ్యంగా ఉందని, ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని కోరినట్టు తెలిసింది. అనారోగ్య కారణాల వల్ల పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహం వద్ద విచారణ జరుపుతున్న సీఐ రామచంద్రరావు సిబ్బంది

రవాణా రంగాన్ని కాపాడాలని నిరసన



నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

సీతంపేట: ప్రజలపై ఆర్థిక భారాలు వేసే జీవో నంబర్ 31ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ గురువారం అక్కయ్యపాలెం కూడలిలో నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గూడ్స్ లారీలు, ప్రైవేట్ బస్సులు, వ్యాన్లు, కార్లపై భారీగా పన్నులు పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 31ని రద్దు చేసి రవాణా రంగాన్ని కాపాడాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు లేక స్వయం ఉపాధి కింద ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల నుంచి అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని లారీలు, వ్యాన్లు, కార్లు, జీపులు కొనుగోలు చేసి ప్రజలకు సేవలందిస్తూ ప్రభుత్వానికి కోట్లాది రూపాయాల పన్నులు చెల్లిస్తున్న వాహన యజమానులకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. మరో పక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపు, జీఎస్టీ పన్నులతో రవాణా రంగం కుదేలవుతోందన్నారు. జీవో రద్దు చేయని పక్షంలో ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రావికృష్ణ, శివ, కె.రాము, జి.శ్రీను, అప్పలరాజు పాల్గొన్నారు.

బోదకాలు వ్యాధి నియంత్రణపై అవగాహన

మద్రిపాలెం: జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా గురువారం బోదకాలు వ్యాధి(ఫైలేరియా) పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 51వ వార్డులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాధవధార మాధవస్వామి కల్యాణ మండపంలో అంబేడ్కర్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వెంకటేష్ ఆధ్వర్యంలో వ్యాధికి సంబంధించి అన్ని విషయాలను వివరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అందరికీ ఉచిత వైద్యం అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం బోదకాలు వ్యాధిగ్రస్తులను గుర్తించి, నాలుగో స్టేజీలో ఉన్నవారికి కిట్లు, రూ.5 వేల పెన్షన్ అందిస్తోందని చెప్పారు. గత ప్రభుత్వాలు పెన్షన్లు, కిట్లు ఇవ్వలేదని గుర్తు చేశారు. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక బోదవ్యాధిగ్రస్తులను గుర్తించి తక్షణమే వారికి వైద్య సదుపాయం అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

అప్రైజర్లను ఆదుకోవాలని వినతి



బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కర్రి వేణుమాధవ్

బీచ్ రోడ్డు: అరకొర జీతాలతో పని చేస్తున్న స్వర్ణకార అప్రైజర్లను బ్యాంకులు ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ కోరారు. ఈ మేరకు గురువారం బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్‌ను కలిసి పుష్పగుచ్ఛంతో పాటు వినతి పత్రం అందజేశారు. బ్యాంకు మనుగడకు దోహదపడుతున్న స్వర్ణకార అప్రైజర్లకు మాత్రం ఎటువంటి ఆధారం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని రీజనల్ మేనేజర్ హామీ ఇచ్చారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమావేశం గురువారం పిఠాపురం కాలనీలోని జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీల పరిష్కారానికి సంబంధించి ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తీసుకువెళ్లారన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. గత నెల రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో చేసిన తీర్మానాల అమలుకు ఉద్యోగులంతా సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో సంఘం నగర అధ్యక్షుడు కుసుమంచి కృష్ణాజీ, నరసింహం, తదితరులు పాల్గొన్నారు.